క్లుప్తంగా

8న యోగా మహోత్సవం

కొమ్మాది: కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖకు అనుబంధంగా గల మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా ఆధ్వర్యంలో గీతం వేదికగా ఈ నెల 8వ తేదీన యోగా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆయుష్ ప్రాజెక్ట్ నోడల్ ఆఫీసర్ డా.కె.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. వంద రోజులు, వంద నగరాలు, వంద సంస్థల పేరిట కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగా ప్రాజెక్ట్‌ను ఈ ఏడాది గీతంకు కేటాయించినట్లు తెలియజేశారు.

చినుకులతో చల్లబడిన వాతావరణం



మధ్యాహ్నం 3 గంటల సమయంలో తగరపువలసలో మబ్బు పట్టిన వాతావరణం

తగరపువలస: భీమిలిలో శనివారం మధ్యాహ్నం వాతావరణంలో అనూహ్యంగా మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటివరకు ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు ఒక్కసారిగా మబ్బు పట్టిన వాతావరణం, చినుకులతో సేదతీరారు. సాయంత్రం వరకు ఇదే వాతావరణం కొనసాగడంతో పాటు చల్లటి గాలులు వీచాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో రోడ్లపై సంచారం పెద్దగా లేదు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలోనూ చినుకులు పడటంతో రాత్రి వాతావరణం చల్లబడింది. ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనం కాస్త ఉపశమనం పొందారు.

రోడ్డుపై వివాదం.. ట్రాఫిక్‌కు అంతరాయం



జ్యూట్‌మిల్లు రామాలయం వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం వద్ద శనివారం సాయంత్రం ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాట కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కారులో వచ్చిన వ్యక్తులు రహదారి మధ్య కారు నిలిపి వాహనాల రాకపోకలకు తొలుత అంతరాయం కలిగించారు. తరువాత అటువైపు వెళ్లే వ్యక్తి ఒకరు ప్రశ్నించగా కారులో వచ్చిన వ్యక్తులు దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు రహదారిపై వివాదం జరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

సముద్రాన్ని శుభ్రంగా ఉంచుదాం



తీరంలో వ్యర్థాలను సేకరించిన సభ్యులు

కొమ్మాది: భీమిలి నుంచి విశాఖ వరకు తీర ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్లాటిపస్ ఫౌండేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ఇక్కడ బీచ్ వద్ద ప్లాటిపస్ ఫౌండేషన్ ఎస్కేప్స్‌తో కలసి శనివారం తీరంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమాన్ని రెండు రోజులు పాటు నిర్వహించనున్నామని సభ్యులు తెలిపారు. సేకరించిన వ్యర్థాలను జీవీఎంసీ సిబ్బందికి అందజేశామన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



ఫేర్‌వెల్ డే వేడుకల్లో విద్యార్థినుల నృత్యాలు

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ-2 శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏజీఎం ఎంవీ సురేష్, రీజనల్ ఇన్‌చార్జి ఎండీ అహమ్మద్ అలి, ప్రిన్సిపల్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు



ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నీరు రాని కొత్త కుళాయి



బిందెడు నీటికి పరిమితమైన కొత్త కుళాయి

- చిన్నాపురంలో అరకొరగా నీటి సరఫరా
- మూలకు చేరిన పాత కుళాయిలు
- గొంతు తడపని కొత్త కుళాయిలు
- ప్రైవేట్ విద్యుత్ బోర్లే ఆధారం

పద్మనాభం: మండలంలోని చిన్నాపురంలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ గ్రామంలో కొత్తగా వేసిన కుళాయిల ద్వారా నీరు అరకొరగా సరఫరా అవడంతో గ్రామస్తులు గొంతు తడుపుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

ఇదీ పరిస్థితి..

గ్రామంలో 1300 మంది జనాభా ఉన్నారు. 380 ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ 2018లో వీధి కుళాయిలు ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా ట్యాంకు నిర్మించారు. ట్యాంకు లోలెవెల్లో ఉండడంతో ఎత్తులో ఉన్న వీధి కుళాయిలకు నీరు పంపింగ్ కాకపోవడంతో, ఈ కుళాయిల ద్వారా నీరు ప్రజలకు సరఫరా అయ్యేది కాదు. ఈ కారణంగా ఇవి అలంకారప్రాయమయ్యాయి. వీటికి ప్రత్యామ్నాయంగా కొన్ని ప్రాంతాల్లో ఇటీవల జల జీవన్ మిషన్ నిధులతో కొత్తగా సుమారు 150 కుళాయిలు వేశారు. రామాలయం వీధి, ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని ఇళ్ల వద్ద ఈ కుళాయిలు ఏర్పాటు చేశారు. రోజూ అరగంట సేపు మాత్రమే ట్యాంకు నుంచి నీరు కుళాయిలకు వస్తుంది. ఈ అరగంటలో కొన్ని కుళాయిల ద్వారా నీరు అసలు రాదు. కొన్ని కుళాయిల నుంచి బిందెడు నీరు మాత్రమే వస్తుంది. మరికొన్ని కుళాయిల ద్వారా రెండు నుంచి మూడు బిందెల నీరు మాత్రమే వస్తుంది. ఈ నీరు చాలకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.



ప్రైవేట్ విద్యుత్ బోరు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

అలంకారప్రాయమే..

కార్మికుల వీధి, కాలనీలో కొత్తగా కుళాయిలు ఏర్పాటు చేయలేదు. కాలనీలో ఉన్న పాత కుళాయిలు చుక్కనీరు ఇవ్వక అలంకారప్రాయమయ్యాయి. వీరు ప్రైవేటు విద్యుత్ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నారు. అది కూడా సొంత ఇంటి యజమానులు తమ తాగు నీటి అవసరాల కోసం విద్యుత్ బోరు వేసినప్పుడు ప్రజలు ఇక్కడికి తాగునీటి కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తగా వేసిన కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగు నీరు సరఫరా చేయాలని.. కార్మికుల వీధి, కాలనీలో కొత్తగా కుళాయిలు వేసి తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బోరుబావుల నుంచి ఉప్పు నీరు



కాలనీలో తాగడానికి పనికిరాని బోరు బావి

గ్రామంలో ఉన్న ఎనిమిది వీధి బోరుబావుల నీరు ఉప్పుగా ఉండడంతో తాగునీటికి పనికి రాదు. కనీసం ఈ నీటితో పప్పులు కూడా ఉడకవు. ఈ బోరుబావుల నీటిని స్నానాలు చేయడం వంటి వాడుకలకు మాత్రమే ఉపయోగిస్తున్నారు.

బిందెడు నీరే వస్తుంది



మా ఇంటి వద్ద ఉన్న కొత్త కుళాయి ద్వారా నీరు సరిగా రాదు. వచ్చినా బిందెడు నీరు మాత్రమే వస్తుంది. ఈ బిందెడు నీటితో రోజంతా గొంతు తడుపుకోవల్సిన పరిస్థితి. తాగునీరు చాలక ఇబ్బంది పడుతున్నాం. కుళాయిల ద్వారా పూర్తి స్థాయిలో నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలి – పి.పైడమ్మ, చిన్నాపురం

అసలు నీరే రావట్లేదు



మా ఇంటి వద్ద ఉన్న కొత్త కుళాయి ద్వారా నీరు అసలు రానే రాదు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. మా ఇంటి వద్ద కుళాయి ఉన్నా ప్రయోజనం లేకపోయింది. కుళాయి ద్వారా నీరు సరఫరా చేసి, మా గ్రామస్తుల దాహార్తి తీర్చాలి. – పి.పెంటమ్మ, చిన్నాపురం

ప్రైవేట్ బోర్ల ద్వారా గొంతు తడుపుకొంటున్నాం



మా ఊళ్లో కొంతమంది తమ ఇళ్లలో సొంతంగా విద్యుత్ బోర్లు వేసుకున్నారు. ఈ బోరుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. ఈ ఇంటి యజమానులు మంచి వారు కాబటి నీరు పట్టుకోనిస్తున్నారు. కాస్త గొంతు తడుపుకొంటున్నాం. అధికారులు స్పందించి, శాశ్వత పరిష్కారం చూపాలి. – జి.అప్పలనరసమ్మ, చిన్నాపురం

బోరు నీరు తాగలేం



మా కాలనీ వద్ద బోరు బావి ఉంది. ఈ బోరు నీరు తాగడానికి పనికిరాదు. కనీసం ఆ నీటితో వంట కూడా చేసుకోలేం. పప్పులు అసలు ఉడకవు. మా కాలనీలో కొత్త కుళాయిలు ఏర్పాటు చేయలేదు. పాత కుళాయిలు ద్వారా నీరు రావడం లేదు. కాలనీలో కొత్తగా కుళాయిలు వేసి మా దాహార్తిని తీర్చాలి. – యు.అప్పయ్యయ్య, చిన్నాపురం

వీధి దీపాలు ఏర్పాటు చేశారు



కాంతులీనుతున్న వీధిదీపాలు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: చిట్టివలస–గుడివాడ గోస్తనినది వంతెన అప్రోచ్ రోడ్డును ఆనుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కమార్గంలో ఎట్టకేలకు శనివారం వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం గోస్తని నదికి, శ్మశానవాటికకు ఆనుకుని ఉండటంతో చీకటి పడితే విష పురుగులు ప్రవేశిస్తుంటాయి. ముఖ్యంగా ఈ కూడలిలో రాత్రి 10 గంటల తరువాత ఒంటరిగా రాకపోకలు సాగించే వారిపై దాడులు జరుగుతున్నందున వీధిదీపాల ఆవశ్యకత గురించి స్థానికులు గట్టిగా కోరారు. దీంతో గత నెల 6న 'వీధిదీపాలు ఏర్పాటు చేయరూ..' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన సంగతి తెలిసిందే. అనంతరం వినతిపత్రాలు కూడా అందించారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది పరిశీలించి, వీధిదీపాలు ఏర్పాటు చేశారు.

సాక్షికి ధన్యవాదాలు



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడంలో సాక్షి ముందంజలో ఉంది. వీధి దీపాల సమస్యలపై ప్రస్తుతం, గతంలో కూడా ప్రముఖంగా ప్రచురించడంతో సమస్య తీరింది. ఈ ప్రాంత ప్రజల తరపున సాక్షికి ధన్యవాదాలు.

– బుడుమూరి వాసు, చిట్టివలస

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కెల్ల అచ్చిబాబు (ఫైల్)

తగరపువలస: ఆనందపురం పంచాయతీ చాకలి వీధికి చెందిన కెల్ల అచ్చిబాబు (32) శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారకస్థితికి చేరుకున్న అచ్చిబాబు శనివారం మరణించినట్లు తల్లి సూరమ్మ ఆనందపురం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముల కల్యాణము చూతము రారండి

- చూడచక్కగా ముస్తాబైన పల్లెలు
- పలువురికి ఆహ్వాన పత్రాలు
- ముమ్మరంగా ఏర్పాట్లు

సీతారాముల కల్యాణానికి పల్లెలు ముస్తాబయ్యాయి. చలువ పందిళ్లు.. విద్యుద్దీపాలు.. రంగులతో తీర్చిదిద్దిన ఆలయాలు.. కొబ్బరి, మామిడి తోరణాలతో అలంకరణలతో చూడముచ్చటగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇప్పటికే రాట మహోత్సవాలు పూర్తి కాగా.. పలువురికి కల్యాణ మహోత్సవ ఆహ్వానాలు పంపించారు. ఇక కల్యాణ వైభోగమే..



సంతపేట కుమ్మరివీధిలో సీతారామాలయం వద్ద చలువ పందిరి



వలందపేట రామాలయం వీధిలో ఆకట్టుకుంటున్న అలంకరణ



విద్యుత్ వెలుగుల్లో దుర్గాలమ్మ ఆలయం

తగరపువలస: శ్రీరామ నవమి పర్వదిన వేళ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు జీవీఎంసీ పరిధిలోని సీతారామాలయాలు సిద్ధమవుతున్నాయి. కల్యాణ వేడుకలు జరిపే ప్రతి ఆలయంలో పానకం, వడపప్పు అనంతరం మధ్యాహ్నం భారీ అన్న సమారాధనలు నిర్వహిస్తున్నారు. సీతారాముల కల్యాణ వేడుకలు తిలకించడానికి ఆలయ కమిటీల ప్రతినిధులు ఇప్పటికే పలువురికి ఆహ్వానాలు పంపించారు. ఆనందపురం మండలం పెద్దిపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో బావిశెట్టి ప్రసాదరావు దంపతులు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. సంతపేట కుమ్మరివీధి, రెడ్డివీధి, రజక వీధి, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం, గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి ఇంటి వద్ద, వలందపేట, తగరపువలస మెయిన్‌రోడ్డు, సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీ, టి.నగరపాలెం, తాటితూరు, శింగనబంధ, అన్నవరం, చిప్పాడ, పాతపాలెం, మూలకుద్దు, జీరుపేట, చిల్లపేట, నమ్మివానిపేట, ఆనందపురం మండలంలోని దుక్కవానిపాలెం, పొడుగుపాలెం, బోయపాలెం, గుడిలోవ, గంభీరం ఐఐఎంలోని హరేకృష్ణ వైకుంఠం తదితర చోట్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దుర్గాలమ్మ ఆలయం వద్ద..

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ, మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద గల శ్రీ కొండ రాముడి ఆలయం, ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని భద్రాచల రాముడి ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయదుర్గాదేవి ఆలయం, గణేష్‌నగర్‌లోని విజయ గణపతి ఆలయాలతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంటుల్లోనూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయని ఆలయాల ధర్మకర్తలు, అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, పిళ్లా సూరిబాబు తదితరులు తెలిపారు.

ఐనాడలో రాట ఉత్సవం

పద్మనాభం: మండలంలోని ఐనాడ రామాలయం వద్ద సీతారాముల కల్యాణానికి సంబంధించి పెళ్లి రాట ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కోరాడ ఆరంజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు మామిడి శివ రామకృష్ణ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ..

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో తెలిపారు. వేకువ జామున 4.30 గంటలకు మంగళహారతి, 7.30 గంటలకు దర్శన హారతి, 8 గంటలకు శ్రీరామ కథ, 8.30 గంటలకు శోభాయాత్ర, 10 గంటలకు సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు భజన, కీర్తన, 6 గంటలకు అభిషేకం, 8 గంటలకు గౌర హారతి నిర్వహించనున్నట్లు తెలియజేశారు.



ఐనాడ రామాలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న గ్రామస్తులు

శిల్పారామంలో..

పీఎం పాలెం: స్థానిక శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక ఇన్‌చార్జి పరిపాలన అధికారి రమణ తెలిపారు. సాయంత్రం 6గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ బృందంచే కోలాటం అనంతరం శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని తెలియజేశారు.

ముస్తాబైన రామాలయాలు

పద్మనాభం: శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబయ్యాయి. మద్ది, కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, ఐనాడ, విలాస్కాన్‌పాలెం, రెడ్డిపల్లి, పాత కొవ్వాడ, అనంతవరం, కొత్త కొవ్వాడ, పెంట, బి.ఆర్.తాళ్లవలస గ్రామాల్లో రామాలయాలు ముస్తాబయ్యాయి. కల్యాణానికి సంబంధించి విగ్రహాలను ముస్తాబు చేశారు.

పాలనాదక్షుడు జగ్జీవన్‌రామ్

- జయంతి వేళ బాబూజీకి ఘన నివాళులు



వేములవలస ఎస్సీ కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న స్థానికులు



మధురవాడ రిక్షా కాలనీలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

తగరపువలస: భారతదేశంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం గల పరిపాలనాదక్షుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఉత్తరాంధ్ర దళిత నాయకుడు భాగం గోపాలరావు అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా ఆనందపురం మండలం వేములవలస ఎస్సీ కాలనీలో ఆయన విగ్రహానికి జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన గురించి స్థానికులకు తెలియజేశారు. 50 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యుడిగా సేవలందించారన్నారు. రైల్వే మంత్రిగా, రక్షణ మంత్రిగా, వ్యవసాయశాఖ మంత్రిగా దేశానికి సేవలు అందించారన్నారు. దళిత సమాజానికి జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ రెండు కళ్లులాంటి వారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంకా కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎ.రామకృష్ణనాయుడు, స్థానిక నాయకులు సియ్యాద్రి రాంబాబు, రాచర్ల ముకుందరావు, ఉప్పాడ సీతారాం, లంక పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లోని మండల బీజేపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు తమటపు నాగమణి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి

మధురవాడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని వక్తలు కొనియాడారు. మధురవాడ రిక్షా కాలనీలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్), మాదిగ జన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆయన జయంతిని నిర్వహించారు. మాదిగ జన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. చిన్నారావు, కేవీపీఎస్ నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ దేశంలో దళిత, బహుజనుల సంక్షేమం కోసం పాటుపడిన నాయకుడు బాబూజీ అన్నారు. కార్యక్రమంలో మామిడి శేఖర్, పి.చంటి, కె. పుష్ప, సీఐటీయూ నాయకులు జి.లలిత, సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌లో..

పీఎం పాలెం: కులరహిత సమాజం కోసం పాటుపడిన గొప్పనేత జగ్జీవన్ రామ్ అని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బక్కన్నపాలెం ఏపీఎస్పీ బెటాలియన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ భావి తరాలు జగ్జీవన్ రామ్ నాయకత్వ దక్షతను ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.సత్యం, ఎస్.మురళీధర్, బి.రామకృష్ణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ టి.శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



బక్కన్నపాలెం ఏపీఎస్పీ బెటాలియన్‌లో..

కాల్వలపై అస్తవ్యస్తంగా పలకలు



కార్‌షెడ్ జంక్షన్ వద్ద పూర్తిగా వేయని పలకలు



వుడా కాలనీకి వెళ్లే మలుపులో ..

మధురవాడ: జీవీఎంసీ 5,6,7 వార్డుల పరిధిలోని సర్వీస్ రోడ్డులో కాల్వలపై పలకలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఈ రోడ్డులో కొమ్మాది జంక్షన్ మొదలు కార్ షెడ్ జంక్షన్ మధ్య ఉన్న రైతు బజార్, డైలీ మార్కెట్, మధురవాడ అప్ బ్రిడ్జి, చంద్రంపాలెం, మిథిలాపురి ఉడా కాలనీ జంక్షన్, కార్‌షెడ్, జీవీఎంసీ జోనల్ ఆఫీసు, హైస్కూలు, జాతర తదితర ప్రాంతాల్లో కాల్వలపై గతంలో ఏర్పాటు చేసిన చాలా శ్లాబులు పాడయ్యాయి. దీంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. తరచూ ప్రమాదాలు కూడా చోటు చేసుకునేవి. పశువులు కూడా కాల్వల్లో పడిపోయిన సందర్భాలున్నాయి. ఈ ఇబ్బందులపై పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు స్పందించిన అధికారులు నిధులు మంజూరు చేసి, పనులు కూడా ప్రారంభించారు. అయితే, 2 నెలల క్రితం చేపట్టిన పనులు నామమాత్రంగా జరిగాయి. దీంతో శ్లాబులు ఏర్పాటు చేసిన చోట పనుల్లో నాణ్యత లోపించింది. మరికొన్ని చోట్ల అంతంత మాత్రంగా చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రహరీ కూల్చి.. కుటుంబ సభ్యులపై దాడి

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో శనివారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న ప్రహరీని కూల్చి.. ముగ్గురు వ్యక్తులను తీవ్రంగా గాయపరచిన సంఘటన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. డొకర అప్పలనాయుడు(50) అనే వ్యక్తి నాలుగు రోజులుగా ఇంటి ప్రహరీ నిర్మించుకొని.. శనివారం ప్లాస్టింగ్ పనులు చేస్తున్నారు. సాయంత్రం పొరుగునే ఉన్న కృష్ణ, అచ్చిబాబు, సూర్యనారాయణ, సన్యాసి సుమారు 30 మందితో కలిసి కర్రలు, కత్తులు, ఇటుకలతో దాడి చేసి ముందుగా ప్రహరీని కూల్చివేశారు. అప్పలనాయుడు ఉదయం మాట్లాడదామని చెప్పినా వినకుండా తలపై మోదారు. అడ్డు వచ్చిన అప్పలనాయుడు భార్య లక్ష్మి(46)పై కూడా దారుణంగా దాడి చేశారు. విషయం తెలుసుకున్న వీరి పెద్ద కుమారుడు హేమసాయి ఇంటికి రావడంతో అతడిని కూడా విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడిలో అప్పలనాయుడు, హేమసాయి(24)లకు తలపై తీవ్రంగా, లక్ష్మికి చేతిపై గాయాలయ్యాయి. ఈ ముగ్గురు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు.





దాడిలో గాయపడిన తండ్రీ కొడుకులు అప్పలనాయుడు, హేమసాయి

భీమిలి పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ దాడిలో హేమసాయి వద్ద లైటింగ్ పనులు చేసే ఇద్దరు దళిత యువకులను కూడా కొట్టినట్టు తెలిసింది.